సాక్షి నంద్యాల

బుధవారం । 8 । మే । 2024



మల్లన్నకు నృత్య నీరాజనం

ఆత్మకూరు: శ్రీశైల ఆలయ నిత్య కళావేదికపై మంగళవారం నంద్యాలకు చెందిన నంది ఫైన్ ఆర్ట్స్ అండ్ ఆర్టిస్ట్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



పరివార దేవుళ్లకు పూజలు

ఆత్మకూరు: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీ బయలు వీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు.



నిఘా నేత్రం..

కర్నూలు జిల్లా లోని 2,204 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. 8లో▶

న్యూస్‌రీల్

గిరిజన గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం బాలుర గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల, కళాశాలలో ప్రవేశానికి గతనెల 7వ తేదీన నిర్వహించిన పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి.రవీంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల నోటీసు బోర్డులో చూసుకోవచ్చని పేర్కొన్నారు. సీటు పొందిన విద్యార్థులు తమకు అందిన కాల్ లెటర్‌తో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ నకలుతో ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు సున్నిపెంటలోని గిరిజనసంక్షేమ గురుకుల ప్రతిభా పాఠశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని వివరించారు. వివరాలకు 8వ తరగతి ప్రవేశానికి 9885670106, 830969314, ఇంటర్ ప్రవేశానికి 8099172737, 9177819676ను సంప్రదించాలని సూచించారు.





నీరా'జనం'

ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఊరూరా జనం నీరాజనం పలుకుతున్నారు. మంగళవారం వెలుగోడు పట్టణంలో శ్రీశైలంఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, బుడ్డా శేషారెడ్డికి ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. అభిమానంతో పూల వర్షం కురిపించారు. మేమంతా వైఎస్సార్‌సీపీ వెంటే అంటూ కదంతొక్కారు. జై జగనన్న.. జై శిల్పా నినాదాలు హోరెత్తాయి. – వెలుగోడు

ప్రచార పర్వం

ఊపందుకున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- రెండో రోజు 6,958 మంది వినియోగించుకున్న ఉద్యోగులు
- నేడు చివరి రోజు



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకుంటున్న ఉద్యోగులు

నంద్యాల: సార్వత్రి ఎన్నికల్లో భాగంగా జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ మొదటి రోజు నెమ్మదించగా రెండవ రోజు ఊపందుకుంది. నంద్యాల జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో మంగళవారం రాత్రి 7గంటల వరకు జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో ఉద్యోగులు అత్యధిక మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియపై విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 17,939 పోస్టల్ బ్యాలెట్లు ఉండగా అందులో మంగళవారం 6,958 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. సోమ, మంగళవారాల్లో 12,694 (76.4 శాతం) మంది అత్యవసర సర్వీసులు ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 1,818 మంది ఓటర్లు, శ్రీశైలంలో 1,491, నందికొట్కూరులో 2,056, డోన్ లో 2,209, నంద్యాలలో 3,068, బనగానపల్లెలో 2,052 మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగుల సౌలభ్యం కోసం ఎక్కడైతే శిక్షణ ఇచ్చారో ఆయా ప్రాంతంలోనే ఓటు హక్కు వేసుకునే అవకాశం కల్పించామన్నారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే మన జిల్లాలో ఉన్నవాళ్లు ఏ నియోజకవర్గంలో ఓటు ఉంటే ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఇతర జిల్లాల్లో ఓటు ఉన్నవాళ్లు మన జిల్లాలో ఎక్కడైతే పనిచేస్తూ ఫార్మ్‌- 12ఈ ఇచ్చిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు.

బీసీ బరితెగింపు

- ఓటమి భయంతో దాడులకు తెగబడిన బనగానపల్లె టీడీపీ అభ్యర్థి
- ఓట్ల కోసం అడ్డదారుల్లో డబ్బు పంపకాలు, ప్రలోభాలకు యత్నం
- లేదంటే భౌతిక దాడులు, దౌర్జన్యాలు
- ప్రశాంత నియోజకవర్గంలో అల్లర్లు సృష్టిస్తున్న వైనం





వైఎస్సార్‌సీపీ శ్రేణులపై పదునైన ఆయుధాలు, కర్రలతో దాడి చేస్తున్న టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి అనుచరులు



తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కోనేటి దుర్గ



కోవెలకుంట్ల: ఓ వైపు సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తుండటం.. మరో వైపు ప్రజల్లో సరైన ఆదరణ కనిపించకపోవడంతో టీడీపీ అభ్యర్థుల్లో ఓటమి భయం వెంటాడుతోంది. ఈ క్రమంలో బనగానపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి ఎలాగైనా ఓటర్లను నయానో.. భయానో తమ వైపు మళ్లించుకునేందుకు ప్రధాన అస్త్రాలను బయటకు తీస్తున్నాడు. ఇప్పటికే రెండు నెలల నుంచి విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లుతూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నాడు. వీటి ద్వారా గెలుపుసాధ్యం కాదని భావించి తాజాగా భౌతిక దాడులకు దిగాడు. మంగళవారం బనగానపల్లె పట్టణంలో కూరగాయల మార్కెట్ వద్ద బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ సమక్షంలో టీడీపీ మూకలు రెచ్చిపోయాయి. రౌడీయిజం ప్రదర్శిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కర్రలు, రాడ్లతో దాడిచేశాయి. ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపుతోంది. ఎన్నికల వేళ ఓటమి భయంతో బరితెగింపు చర్యలకు పాల్పడటంతో ఓటర్లు భయాందోళన చెందుతున్నారు. వ్యాపారవేత్తగా భూకబ్జాలతో కోట్లాది రూపాయలు గడించిన బీసీ జనార్దన్‌రెడ్డి 2014 సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ ప్రవేశం చేశాడు. ఈ ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. మొదటిసారి ఎమ్మెల్యే కావడంతో నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలపై విశ్వరూపం చూపాడు. ప్రభుత్వ ఉద్యోగులకు నరకం చూపించాడు. ఐదేళ్లపాటు నీరు- చెట్టుపేరుతో కోట్లాది రూపాయల ప్రభుత్వ సొమ్మును దోచుకున్నాడు. దీంతో 2019 ఎన్నికల్లో నియోజకవర్గ ఓటర్లు బీసీకి బుద్ధి చెప్పి ఓడించారు. ఈ నెల 13వ తేదీన 2024 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఉండటంతో ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో డబ్బులు, ప్రలోభాలు, భౌతిక దాడులను ఎన్నికల అస్త్రాలుగా ఎంచుకున్నాడు.

ప్రజా బలం లేక..

2019లో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధితో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేశారు. మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసి నవరత్న పథకాల్లో మహిళలకే అధిక ప్రాధాన్యత కల్పించి పేదరిక నిర్మూలను కృషి చేశారు. పేదలు, పెత్తందారుల మధ్య జరుగుతున్న ఎన్నికల్లో పెత్తందారులు టీడీపీ వైపు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన పోరాటం చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ బనగానపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రామిరెడ్డికి గ్రామాల్లో వస్తున్న ఆదరణను ఓర్వలేక ఈ ఎన్నికల్లో మరలా ఓటమి తప్పదని భావించాడు. ఎలాగైనా గెలవాలన్న కుతంత్రంతో బరి తెగింపు చర్యలకు పాల్పడుతున్నాడు. నియోజకవర్గంలో ఆ పార్టీకి ప్రజాబలం లేకపోవడంతో డబ్బును ప్రధాన అస్త్రం చేసుకుంది. అరకొరగా నిర్వహిస్తున్న ప్రచారానికి సైతం అద్దె కార్యకర్తలపై ఆధార పడాల్సి రావడంతో ఆ పార్టీ శ్రేణులను కలవర పరుస్తోంది.

సొంత నేతలకు వడ్డీ లేని రుణాలు.. ఓటర్లకు టోకెన్లు

ఎన్నికలు సమీపిస్తుండంతో గెలుపుకోసం బీసీ కుయుక్తులకు తెరలేపాడు. పార్టీలో చేరిన వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులకు కేడర్‌ను బట్టి రూ. 3 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు డబ్బులు ముట్టజెప్పాడు. ఇందులో ఎక్కువభాగం కొలిమిగుండ్ల మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీలో చేరిన వైఎస్సార్‌సీపీ నాయకులకు డబ్బులు అందజేశాడు. అలాగే టీడీపీలో కొనసాగుతున్న నాయకులకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నాడు. ఒక్కో నాయకుడికి రూ. 5 లక్షల నుంచి రూ. 20 లక్షలవరకు వడ్డీలేని రుణాలు ఇచ్చాడు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఓటర్లకు ఓటరుస్లిప్‌లు అందజేస్తున్నారు. 'బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంట్' పేరుతో ఓటరు స్లిప్‌కు మరోవైపు టోకెన్ ముద్రించిన స్లిప్‌లు పంపిణీ చేశారు. త్వరలో పట్టణ ప్రాంతాల్లో ఓటుకు రూ. 3 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 2 వేల చొప్పున డబ్బులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. డబ్బులు పంపిణీ చేసే రోజు ఓటర్‌స్లిప్‌కు ఉన్న టోకెన్ చూపించిన వారికి డబ్బులు అందజేయనున్నారు. టీడీపీ సానుభూతి పరులైన ఓటర్లు, తటస్థ ఓటర్లకు స్లిప్‌లు పంపిణీ చేశారు.

హత్యాయత్నం కేసులో జైలు..

మొదటి నుంచి బీసీ జనార్దన్‌రెడ్డికి క్రూరస్వభావం ఉంది. ప్రతి చిన్న విషయంలో జోక్యం చేసుకుని అన్ని వర్గాల ప్రజలను ఇబ్బంది పెట్టే నైజం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీకి అనుకూలంగా ఉన్నాడన్న నెపంతో బనగానపల్లె పట్టణానికి చెందిన ఎస్టీ వర్గానికి చెందిన కోనేటి దుర్గ అనే వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ కేసులో బీసీ నెల రోజులపాటు కటకటాలపాలైన విషయం తెలిసిందే. ఆ క్రూరత్వాన్ని మళ్లీ ప్రదర్శిస్తున్నాడు. సామ, వేద, దండోపాయాలు ప్రదర్శించి ఎన్నికల్లో గెలవాలని కుతంత్రం చేస్తున్నాడు. ఎన్నికలకు ముందే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న బీసీ రాబోయే రోజుల్లో మరెంత బరి తెగిస్తాడని బనగానపల్లె ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి వ్యక్తికి త్వరలో జరగబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఓటర్లు నిర్ణయించుకున్నారు.

ఓటమి భయంతోనే దాడులు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన తనయుడు ఓబుల్‌రెడ్డి

బనగానపల్లె: సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి దాడులకు పాల్పడుతున్నాడని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. మంగళవారం టీడీపీ వర్గీయుల దాడిలో తీవ్రగాయాలై స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరామర్శించి, దాడి ఘటన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులకు అన్నివిధాలుగా తాము సహకరిస్తున్నామన్నారు. అయితే ప్రచారం ముగింపు దశలో ఉండగా ఓటమి భయంతో మాజీ ఎమ్మెల్యే బీసీ ప్రజలను రెచ్చగొట్టి అల్లర్ల సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మంగళవారం బనగానపల్లెలో మాజీ ఎమ్మెల్యే బీసీ సతీమణి ఇందిరమ్మ సమక్షంలో ఘర్షణ జరిగిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ప్రచార సమయంలో వారి వద్ద కరపత్రాలు ఉండాలి గాని, కర్రలు, రాడ్లు ఎలా వచ్చాయే పోలీసులు తేల్చాలన్నారు. ముందస్తుగానే ప్రణాళికతో వారు దాడులకు దిగినట్లు తెలుస్తుందన్నారు. గతంలో కోనేటి దుర్గపై మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి దాడికి పాల్పడి ఈ కేసులో జైలుకు కూడా వెళ్లాడన్నారు. మళ్లీ కొనేటి దుర్గతో పాటు ముస్లిం మైనార్టీ, బీసీ వర్గీయులపై దాడులు చేయడం శోచనీయమన్నారు. ఘర్షణకు కారకులైనవారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కాటసాని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు సమన్వయం పాటించి ప్రశాంతంగా ఎన్నికల ప్రచారం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువనేత కాటసాని ఓబులరెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోసకారి చంద్రబాబును తరిమేయండి

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



మల్లెంపల్లె ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: అరచేతిలో వైకుంఠాన్ని చూపే మోసకారి చంద్రబాబును రాజకీయాల నుంచి తరిమేయాలని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఓటర్లకు సూచించారు. మండలంలోని మల్లెంపల్లె గ్రామంలో సర్పంచ్ బోయ గంగప్ప, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు పోస్టుప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచరణకు సాధ్యం కాని హామీలను మేనిఫెస్టోలో ప్రకటించారని గుర్తుచేశారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అంటూ ఊదరగొడుతున్న చంద్రబాబు ఆర్టీసీని నష్టాల పాలు చేయాలని చూస్తున్నారన్నారు. అధికార దాహంతో కుట్రలు, కుతంత్రాలు పన్నుతూ వైఎస్ఆర్‌సీపీని ఓడించేందుకు చంద్రబాబు చేయని ప్రయత్నమంటూ లేదన్నారు. మతతత్వ పార్టీ అయిన బీజేపీ, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, మాయలోడు చంద్రబాబు కూటమిగా ఏర్పడి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నికల్లో ఎదుర్కొనేందుకు వస్తున్నారన్నారు. ఈ మాయగాళ్లకు రేపు జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తగిన విధంగా గుణపాఠం నేర్పేందుకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి బుద్ధి చెప్పాలన్నారు.

అరాచకాలు సృష్టిస్తున్నారు..

పదేళ్లుగా ప్రశాంతంగా ఉన్న డోన్ నియోజకవర్గంలో మళ్లీ ఫ్యాక్షన్ రాజకీయాలకు పాల్పడేందుకు కోట్ల, కేఈ వర్గాలు ఒక్కటయ్యాయని మంత్రి బుగ్గన ఆరోపించారు. పదేళ్ల నియోజకవర్గ ప్రజలకు కనిపించకుండా ఉన్న ఈ రెండు వర్గాలు అధికారం కోసం మళ్లీ గ్రామగ్రామాన వర్గ విబేధాలు సృష్టించి కక్షలు, కార్పణ్యాల కుంపటిని రగిల్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల జరిగిన ప్యాపిలి, పెద్దపూజెర్ల గ్రామాలతో పాటు అనేక సంఘటనలు మంత్రి ఈ సందర్భంగా ఉదాహరించారు. ఎన్నికల్లో ఓడిపోగానే రెండు వర్గాల వారు మూట ముల్లె సర్దుకొని కర్నూలు, హైదరాబాదుకు వెళ్లి తలదాచుకుంటాయన్న సంగతి ప్రజలందరికీ తెలుసునన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, ఎర్రన్న, తలారి శేఖర్, చిన్న రామచంద్రుడు, తలారి రాముడు, ఎల్‌ఐసి క్రిష్టన్న, సుంకన్న, వడ్డె బాలు, ఎల్లక్రిష్ణ, జయరాముడు, శ్రీను, ఆవుల సుంకన్న, చిన్నరాముడు, నాగరాజు, రాముడు, కోయిలకొండ క్రిష్ణ, ఆటో మాదులు, మిద్దెపల్లె రంగడు, తలారి శేఖర్, జిన్ను రామచంద్రుడు పాల్గొన్నారు.

ఆర్‌యూ బీటెక్ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ బీటెక్ ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గత ఏడాది డిసెంబర్, ఈ ఏడాది జనవరి నెలల్లో నిర్వహించిన బీటెక్ 1, 3, 5 సెమిస్టర్, అన్ని సెమిస్టర్‌ల సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. బీటెక్ మొదటి సెమిస్టర్‌లో 170 మందికి 33, మూడో సెమిస్టర్‌లో 164 మందికి 72, ఐదో సెమిస్టర్‌లో 164 మందికి 132 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. సప్లిమెంటరీ మొదటి సెమిస్టర్‌లో 125 మందికి 42, 2వ సెమిస్టర్‌లో 136 మందికి 49, 3వ సెమిస్టర్‌లో 71 మందికి 11, 4వ సెమిస్టర్‌లో 81 మందికి 47, ఐదో సెమిస్టర్‌లో 25 మందికి 20, 6వ సెమిస్టర్‌లో 49 మందికి 28, 7వ సెమిస్టర్‌లో 12 మందికి 10, 8వ సెమిస్టర్‌లో ఐదుగురికిగాను నలుగురు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు.

తిరోగమనంలో టీడీపీ

- జిల్లాలో రోజురోజుకు దిగజారుతున్న పార్టీ పరిస్థితి
- సూపర్ సిక్స్ మేనిఫెస్టో పట్టించుకోని జనం
- వలంటీర్ల సేవలను అడ్డుకున్న బాబు అండ్ కో
- టీడీపీ నేతలపై మండిపడుతున్న పింఛన్‌దారులు
- పార్టీ అధినేతల ప్రచారానికి స్పందన కరువు
- ఓటమి దిశగా సాగుతున్న టీడీపీ



సాక్షి, నంద్యాల: వైస్సార్‌సీపీ కంచుకోటగా ఉన్న నంద్యాల జిల్లాలో ఎలాగైనా ఖాతా తెరవాలని టీడీపీ చేస్తున్న ప్రయత్నాలకు ఎక్కడా కలసిరావడం లేదు. జిల్లాలో రోజురోజుకు పార్టీ పరిస్థితి దిగజారిపోతుండటంతో ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది. ఒంటరిగా పోటీ చేస్తే ఓటమి ఖాయమని తెలియడంతో బీజేపీ, జనసేనతో పొత్తు పెట్టుకుని తమ అభ్యర్థులను బరిలోకి దింపింది. అయితే బీజేపీ శ్రేణులు జిల్లాలో ఎక్కడేగాని ప్రచారంలో పాల్గొనడం లేదు. టీడీపీ శ్రేణులు చిన్న చూపు చూస్తుండడంతో కోరి అవమానాలపాలు కావడం ఇష్టం లేక బీజేపీ నేతలు ప్రచారానికి దూరంగా ఉంటున్నారని తెలుస్తోంది. పడిపోతున్న టీడీపీ గ్రాఫ్‌ను జాకీలు పెట్టి లేపాలనుకుంటున్నా ఫలితం ఉండడం లేదు. నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో ప్రచారంలో డీలా పడ్డారు. రెండు నెలలుగా పింఛన్ల పంపిణీ ఎఫెక్ట్ ఆ పార్టీపై తీవ్ర ప్రభావం చూపేట్లుగా కనిపిస్తోంది. ప్రతి నెలా వలంటీర్లు ఇంటింటికెళ్లి లబ్ధిదారులకు ఠంచన్‌గా ఒకటవ తేదీన అందజేశారు. ఈ క్రమంలో ఎన్నికల వేళ వలంటీర్ల సేవలను టీడీపీ అండ్ కో ఎన్నికల సంఘంతో దూరం చేసింది. నారా చంద్రబాబు నాయుడు నిర్వాకంతో లబ్ధిదారులు నేడు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏప్రిల్‌లో పింఛన్ల కోసం వచ్చి పాములపాడు, పాణ్యం మండలాలలో ఇద్దరు లబ్ధిదారులు మృతి చెందారు. పింఛన్ కష్టాలకు తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడే కారణమని స్పష్టంగా తెలియడంతో ఆ పార్టీ అభ్యర్థులు హడలెత్తిపోతున్నారు. ప్రచారానికి వెళితే వృద్ధులు, మహిళలు నిలదీస్తున్నారు. ఇంటి దగ్గర పింఛన్ తీసుకునే తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న 'మీకెందుకు ఓటేయాలంటూ' ప్రశ్నిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ప్రచారం చేయడానికి జంకుతున్నారు. చంద్రబాబు నిర్వాకంతో తాము తిట్లు తినాల్సి వస్తోందని సొంత పార్టీ నేతలే వాపోతున్నారు.

నిన్ను నమ్మం బాబు..

సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు నాయుడు ఎన్ని హామీలిచ్చినా ప్రజలు నమ్మడం లేదు. ఆచరణ సాధ్యమని కాని హామీలను మేనిఫెస్టోలో ఉంచడంతో ఓటర్లు సైతం పట్టించుకోవడం లేదు. 2014 ఎన్నికల మేనిఫెస్టో తరహాలోనే ఉందని, అప్పుడు అమలు చేయలేని చంద్రబాబు ఇప్పుడు ఎలా నెరవేర్చుతారని ప్రశ్నిస్తున్నారు. అమలు చేయని హామీల గురించి చెబితే నమ్మడానికి తాము సిద్ధంగా లేమని చెబుతున్నారు. ఉచితాలతో ఓటర్లకు తాయిళాలు వేస్తున్నా... హామీల మీద హామీలు ఇస్తున్నా రెస్పాన్స్ లేకపోవడంతో అభ్యర్థులు నైరాశ్యం నెలకొంది.

సభలు వెలవెల.. అభ్యర్థులు విలవిల


ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి జిల్లాలో డోన్, బనగానపల్లె, నందికొట్కూరులో చంద్రబాబు సభలు నిర్వహించారు. మూడు సభలు ఒకదానికి మించి మరొకటి అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. మందు, బిర్యానీ, డబ్బులు ఇచ్చి తరలించినా జనాలు సభకు ముఖం చాటేస్తున్నారు. నందికొట్కూరులో బాలకృష్ణ నిర్వహించిన సభకు జనాలు కరువయ్యారు. ఆయన ఏం మాట్లాడుతున్నారో అర్థం కాకపోవడంతో వచ్చిన కాస్త జనాలు వెనుదిరిగారు. తాజాగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నాయుడు నంద్యాల పట్టణంలో యువగళం పేరుతో సభ నిర్వహించారు. లోకేశ్ వస్తున్నారని ఆ పార్టీ నేతలకే తెలియదు. గురువారం లోకేశ్ వచ్చి వెళ్లినట్లు తెలుగుదేశం వారికే తెలియదంటే లోకేశ్ సభ ఎంత పేలవంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. ఓట్లు లేని ఇంటర్ విద్యార్థులను సభకు తరలించి లోకేశ్ బ్యాచ్ హడావుడి చేసింది. లోకేశ్ సభలో 500 మంది కూడా లేరంటే ఆయన సభ ఎంత చప్పగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. లోకేశ్ ప్రసంగం ఏ మాత్రం ఆకట్టుకోకపోవడంతో వచ్చిన ఆ కాస్తమంది లోకేశ్ ప్రసంగం ప్రారంభమైన 15 నిమిషాలకే వెనుదిరగడం గమనార్హం. పార్టీ అధినేతల సభలకు ప్రజల నుంచి కనీస స్పందన లేకపోవడంతో ఆ పార్టీ అభ్యర్థుల్లో అలజడి మొదలైంది.



పాణ్యం: చెంచు కాలనీలో రోడ్‌షోకు హాజరైన చెంచు మహిళలు (ఇన్‌సెట్‌) అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని, ఎంపీ పోచా



నందికొట్కూరు రూరల్‌: అల్లూరులో నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన ప్రజలు (ఇన్‌సెట్‌) ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్‌, బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి పూలమాల వేసి స్వాగతం పలుకుతున్న ముస్లింలు



గోనెగండ్ల: పెద్దనేలటూర్‌ రోడ్‌షోలో పాల్గొన్న జనం (ఇన్‌సెట్‌) గాజులదిన్నెలో గజమాలతో ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ప్రచార పర్వం

ఊరూరా నీరాజనం

ప్రజాభిమానం పెల్లుబికింది. ఉత్సాహం ఉరకలేసింది. మంగళవారం వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచారం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. రోడ్‌షోలకు విశేష స్పందన కనిపించింది. ఊరూరా భారీ పూలమాలలతో ఎమ్మెల్యేలకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. 'మళ్లీ మీరే మా ఎమ్మెల్యే' అంటూ నినాదాలు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రలను వివరిస్తూ అధికార పార్టీ అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తించారు. -సాక్షినెట్‌వర్క్‌



డోన్‌ రూరల్‌: మల్లెంపల్లె గ్రామంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌ రెడ్డి



కృష్ణగిరి: పత్తికొండలో ఎమ్మెల్యే అభ్యర్థి కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన ఎరుకులచెరువు గ్రామస్తులు



అవుకు: రామాపురంలో వైఎస్సార్‌సీపీ ప్రచారానికి కిక్కిరిసిన జనం (ఇన్‌సెట్‌) రోడ్‌షోలో మాట్లాడుతున్న బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



ఆదోని టౌన్‌: ఎన్నికల ప్రచారంలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



ఉయ్యాలవాడ: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డికి గజమాల వేస్తున్న దృశ్యం



బొమ్మలసత్రం: నంద్యాల పట్టణం 24వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి



కోసిగి: పూలు చల్లుతూ మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి స్వాగతం పలుకుతున్న పెద్దభూంపల్లి గ్రామస్తులు



కోడుమూరు రూరల్‌: అనుగొండ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్‌ సతీష్‌

పెద్దాసుపత్రికి వైద్యపరికరాల విరాళం

కర్నూలు(హాస్పిటల్‌): ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు నగరంలోని శ్రీచక్ర హాస్పిటల్‌ యాజమాన్యం పలు వైద్య పరికరాలు విరాళంగా అందజేసింది. మంగళవారం పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ వి. వెంకటరంగారెడ్డికి వైద్యపరికరాలు, ఈసీజీ మిషన్‌ను శ్రీచక్ర హాస్పిటల్‌ ఎండీ డాక్టర్‌ విజయ కుమార్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ప్రభాకర్‌రెడ్డి, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్‌ బి. వెంకటేశ్వరరావు, డాక్టర్‌ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో 28 మోడల్‌ పోలింగ్‌ కేంద్రాలు

కర్నూలు(సెంట్రల్‌): ఓటింగ్‌ శాతాన్ని పెంచేందుకు జిల్లాలో 28 మోడల్‌ పోలింగ్‌ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్‌ డాక్టర్‌ జి.సృజన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళల నిర్వహణలో 8, యువత నిర్వహణలో రెండు, దివ్యాంగుల నిర్వహణలో మరో 2 ప్రత్యేక పోలింగ్‌ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. పత్తికొండలో 5, కోడుమూరులో 4, కర్నూలులో 1, ఎమ్మిగనూరులో 3, పాణ్యంలో 4 చొప్పున వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మహిళలు, యువత, దివ్యాంగులకు ఓటుపై అవగాహన కల్పించేందుకు ఇవి ఎంతోగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో ఒక పోలింగ్‌ కేంద్రం మహిళల నిర్వహణలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. యువత ఆధ్వర్యంలో నడిచే పోలింగ్‌ స్టేషన్లలో ఒక్క దానిని ఆదోనిలో, మరో దానిని కర్నూలులో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగుల సమక్షంలో ఏర్పాటు చేసే ప్రత్యేక పోలింగ్‌ కేంద్రాల్లో రెండింటిని కర్నూలు నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ఆదోని అర్బన్‌: పెళ్లి చేసుకుంటానని ఓ యువకుడు చెప్పిన మాటలు నమ్మి మోసపోవడంతో మనస్తాపానికి గురై మంగళవారం ఓ యువతి ఫినాయిల్‌ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. యువతి, బంధువులు పోలీసులకు తెలిపిన వివరాలు.. ఎమ్మిగనూరు మండలం దేవిబెట్ట గ్రామానికి చెందిన ఓ యువతి, అదే గ్రామానికి చెందిన ప్రశాంత్‌కుమార్‌ ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ప్రశాంత్‌కుమార్‌ లోబరుచుకున్నాడని యువతి తెలిపింది. అనంతపురంలో బీటెక్‌ రెండో సంవత్సరం చదువుతున్న యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆదోనికి తీసుకొచ్చాడని చెప్పింది. ఆదోనిలో కొత్త బట్టలు తీసుకుందామని తీసుకెళ్లి దృష్టిమరల్చి ఒంటరిగా వదిలేసి వెళ్లిపోయాడని తెలిపింది. ఎంతసేపటికీ తిరిగిరాకపోగా ఫోన్‌కు నిన్ను పెళ్లి చేసుకోను అని ప్రశాంత్‌కుమార్‌ నుంచి మెసేజ్‌ రావడంతో మనస్తాపానికి గురై ఫినాయిల్‌ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. వెంటనే స్థానికులు ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హజ్‌ యాత్రికులకు ఉచితంగా వ్యాక్సినేషన్‌



మహిళకు వ్యాక్సిన్‌ వేస్తున్న వైద్య సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్‌): హజ్‌కు వెళ్లే ప్రతి యాత్రికునికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సినేషన్‌ వేయిస్తోందని డీఎంహెచ్‌వో డాక్టర్‌ వై. ప్రవీణ్‌కుమార్‌ చెప్పారు. మంగళవారం స్థానిక వడ్డేగేరి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హజ్‌కు వెళ్లే యాత్రికులకు వ్యాక్సినేషన్‌ వేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్‌ వై. ప్రవీణ్‌కుమార్‌ మాట్లాడుతూ హజ్‌ యాత్రకు వెళ్లే వారికి తప్పనిసరిగా ప్రత్యేక వ్యాక్సినేషన్‌ కార్యక్రమంలో మూడు రకాల టీకాలు(మెనింగోకాకల్‌, ఇన్‌ఫ్లూయింజా, ఓపీవీ ఓరల్‌ పోలియో) వేస్తారన్నారు. వీరికి స్పెషలిస్టు వైద్యులచే వైద్య పరీక్షలు కూడా నిర్వహిస్తామన్నారు. జిల్లా నుంచి హజ్‌ యాత్రకు బయలుదేరుతున్న వారందరికీ వ్యాక్సినేషన్‌ వేయించామన్నారు. కార్యక్రమంలో డీపీఎంయు డాక్టర్‌ ఉమా, డీపీవో విజయరాజు, వైద్య సిబ్బంది, హజ్‌ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

నిఘా నేత్రం.. ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

- జిల్లాలోని 2,204 పోలింగ్‌ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌
- ప్రతి కేంద్రంలో రెండు అత్యాధునిక సీసీ కెమెరాల ఏర్పాటు

కర్నూలు(సెంట్రల్‌): సార్వత్రిక ఎన్నికలను పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ డాక్టర్‌ జి.సృజన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. గతంలో జరిగిన ఘటనల ఆధారంగా 1,500 పోలింగ్‌ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అనుమతి ఇచ్చారు. అయితే జిల్లాకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో ఉండడంతో డబ్బు, మద్యం అధికంగా రవాణా అవుతోందని, ఎలాంటి గొడవలు జరగకుండా ప్రశాంత ఎన్నికల నిర్వహణకు జిల్లాలోని 2,204 కేంద్రాలకు వెబ్‌కాస్టింగ్‌ కోసం అనుమతి ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘానికి జిల్లా కలెక్టర్‌ లేఖరాశారు. ఇటీవల అక్కడి నుంచి అనుమతి ఇస్తూ ఆదేశాలు రావడంతో అన్ని పోలింగ్‌ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

వెలుపల, లోపల ఏమి జరుగుతుందో తెలుసుకోవచ్చు

వెబ్‌కాస్టింగ్‌లో భాగంగా పోలింగ్‌ కేంద్రంలో లోపల, బయట ఏమి జరుగుతుందో తెలుసుకోవడానికి సులభతరం అవుతుంది. ఇందుకోసం లోపలి దృశ్యాలను రికార్డు చేసేందుకు ఒక్క సీసీ కెమెరాను, బయటి దృశ్యాలను చిత్రీకరించేందుకు మరో సీసీ కెమెరాను అమర్చుతారు. ఒక్కో పోలింగ్‌ కేంద్రానికి రెండు సీసీ కెమెరాలను పంపారు. వీటిని ఈనెల 9, 10వ తేదీల్లో సరైన లోకేషన్లలో అమర్చి వాటిని సంబంధిత నియోజకవర్గ ఆర్వో, కలెక్టరేట్‌లోని కమాండ్‌ కంట్రోల్‌ రూమ్‌, విజయవాడలోని సీఈఓ కార్యాలయానికి కనెక్ట్‌ చేస్తారు. దీంతో పోలింగ్‌ కేంద్రాల లోపల, బయట జరుగుతున్న దృశ్యాలను అప్పటికప్పుడే జిల్లా ఎన్నికల అధికారులు, అబ్జర్వర్లు, సీఈఓ కార్యాలయం, కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు వారి కార్యాలయాల నుంచే తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది. అంతేగాక పోలింగ్‌ ప్రారంభమైనప్పటి నుంచి ఈవీఎంలను స్ట్రాంగ్‌ రూమ్‌లకు తీసుకెళ్లే వరకు ప్రతి నిత్యం కేంద్రాల్లో ఏమి జరుగుతుందో తెలుసుకోవడానికి, ఏమైనా అనుకోని సంఘటనలు జరిగితే నివారించేందుకు చర్యలు తీసుకోవడానికి ఎంతో వీలు ఉంటుంది.

సమస్యలను పరిష్కరించేందుకు సాంకేతిక బృందాలు..

వెబ్‌కాస్టింగ్‌లో ఏమైనా సమస్యలు ఉత్పన్నం అయితే పరిష్కరించేందుకు సాంకేతిక బృందాలను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లోని కమాండ్‌ కంట్రోల్‌ రూమ్‌లో సాంకేతిక బృందాలు అందుబాటులో ఉండి వచ్చిన టెక్నికల్‌ సమస్యల పరిష్కారానికి తగు సూచనలు చేస్తాయి. మే 11, 12 తేదీల్లో డ్రై రన్‌నిర్వహించి పోలింగ్‌ రోజైన మే 13వ తేదీన ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకుంటారు.

సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లు

కర్నూలులో 16, పాణ్యంలో 64, పత్తికొండలో 57, కోడుమూరులో 30, ఎమ్మిగనూరులో 33, మంత్రాలయంలో 25, ఆదోనిలో 49, ఆలూరులో నియోజకవర్గంలో 46 మొత్తం 320 అత్యంత సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలను గుర్తించారు. అలాగే కర్నూలు 7, పాణ్యంలో 3, కోడుమూరులో 2, మంత్రాలయంలో 2 మొత్తం 14 సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాలను గతంలో నమోదైన క్రైమ్‌ రిపోర్టు ఆధారంగా పోలీసులు, రెవెన్యూ అధికారులు గుర్తించారు. వీటిలో మైక్రో అబ్జర్వర్లు ఉండి ప్రతి నిత్యం పోలింగ్‌ కేంద్రంలో ఏమి జరుగుతుందో అబ్జర్వర్లకు నివేదిక ఇస్తుంటారు. అంతేకాక వీడియో గ్రఫీ కూడా తీయిస్తారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరిగిన తక్షణమే అణచి వేసి పోలింగ్‌ ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల సంఘం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది.

బాలుడి అదృశ్యం



సాగర్‌ (ఫైల్‌)

ఆదోని అర్బన్‌: ఆదోని పట్టణంలోని భీరప్పనగర్‌కు చెందిన ఎం.సాగర్‌ (11) అనే బాలుడు మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడని, తిరిగిరాలేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఆదోని వన్‌టౌన్‌ సీఐ తేజమూర్తి విలేకరులకు తెలిపారు. బాలుడు సాగర్‌ 4వ తరగతి చదువుతున్నాడని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 76708 92825, 91211 01135 ఫోన్‌ నంబర్లకు కాల్‌ చేసి సమాచారం అందించాలని కోరారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న నలుగురి అరెస్ట్‌

ఆదోని రూరల్‌: మండలంలోని సాంబగల్‌కు చెందిన పెద్ద దస్తగిరి, రమేష్‌, రాజు, దస్తగిరి అనే నలుగురు వ్యక్తులు రెండు మోటార్‌ సైకిళ్లపై కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని అరెస్ట్‌ చేసినట్లు తాలూకా ఎస్‌ఐ ఎర్రిస్వామి మంగళవారం తెలిపారు. వీరు కర్ణాటక రాష్ట్రం నుంచి రెండు మోటార్‌ సైకిళ్లపై అక్రమంగా నాలుగు మద్యం బాక్సులను తరలిస్తుండగా సాంబగల్‌ గ్రామ శివారులో పట్టుకోవడం జరిగిందన్నారు. మద్యంతో పాటు రెండు మోటార్‌ సైకిళ్లను సీజ్‌ చేసి, సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

డోన్‌ టౌన్‌ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్‌ ఐటీఐలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ఆన్‌లైన్‌ దరఖాస్తులు ఈ నెల 9 నుంచి జూన్‌ 10 వరకు స్వీకరిస్తున్నట్లు జిల్లా కన్వీనర్‌, డోన్‌ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్స్‌పాల్‌ ప్రసాద్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. iti.ap.gov.in అనే వెబ్‌ సైట్‌ లో దరఖాస్తు చేసుకొని ప్రింట్‌ కాపీని సమీప ప్రభుత్వ ఐటీఐల్లో ఈ నెల 10వ తేదీ నుంచి జూన్‌ 10వ తేదీ లోపు ఒరిజినల్‌ సర్టిఫికెట్స్‌తో వెళ్లి వెరిఫికేషన్‌ చేయించుకోవాలన్నారు. పదవ తరగతి పాస్‌, ఫెయిల్‌ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పింఛన్‌ కోసం వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వితంతువు
- రెండు కాళ్లు నుజ్జునుజ్జు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆనందమ్మ



గాయపడిన ఆనందమ్మను పరామర్శించిన అవంతికరెడ్డి

చాగలమర్రి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి నీచ రాజకీయాలకు ఇప్పటికే ఎంతో మంది పింఛన్‌దారులు అవస్థలు పడ్డారు. ప్రతి నెల ఠంచన్‌గా ఒకటో తేదీన ఇంటి వద్ద పింఛన్‌ అందుకోవాల్సి ఉండగా వలంటీర్ల సేవలను దూరం చేయడంతో లబ్ధిదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. తాజాగా ఓ వితంతువు పింఛన్‌ కోసం బ్యాంక్‌కు వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురైంది. మండలంలోని కదిరిపురం దళిత కాలనీకి చెందిన గాలిపోతుల ఆనందమ్మ అనే వితంతు మహిళ తన బ్యాంకు ఖాతాలో జమ చేసిన పెన్షన్‌ మొత్తాన్ని తీసుకోనేందుకు మంగళవారం జాన్సన్‌ అనే యువకుడి బైక్‌పై చాగలమర్రికి బయలుదేరింది. మార్గమధ్యలో యాగంటయ్య బావి వద్ద పొలాల రస్తా నుంచి వేగంగా వస్తున్న ట్రాక్టర్‌ ప్రమాదవశాత్తూ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆనందమ్మ రెండు కాళ్లు నుజ్జునుజ్జు కావడంతో తీవ్ర గాయాలయ్యాయి. జాన్సన్‌కు కుడి భుజానికి, అతని వెంట ఉన్న చిన్నారి మణికుమారికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం చాగలమర్రిలోని కేరళా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాలకు ఆసుపత్రికి తరలించారు. ఆనందమ్మ భర్త సంజీవరాయుడు కిడ్నీ వ్యాధితో మృతి చెందగా, కుమారుడు ఇంటర్‌ చదువుతున్నాడు. ఆమె కుమార్తెకు వివాహం కాగా భర్తతో విభేదాలతో పుట్టింటిలోనే ఉంటుంది. వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్న ఆనందమ్మ రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో ఆ కుటుంబంలో ఆందోళన నెలకొంది. చంద్రబాబు నీచ రాజకీయాలకు ఓ నిరుపేద కుటుంబం రోడ్డున పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు అవంతికారెడ్డి ఆసుపత్రి వద్దకు వచ్చి ఆనందమ్మను పరామర్శించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టరును స్వాధీనం చేసుకోని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

క్లుప్తంగా

అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు



నందవరం ఇసుక క్వారీలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ హెచ్చరించారు. నందవరం ఇసుక క్వారీలో అక్రమంగా ఇసుక తవ్వి తరలిస్తున్నారనే సమాచారంతో జిల్లా మైనింగ్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. ఎలాంటి అక్రమ తవ్వకాలు జరగలేదని నిర్ధారించారు. స్థానికులు వారి అవసరాల నిమిత్తం ఇసుకను ఎద్దుల బండ్లతో తీసుకుంటున్నారని, ఎలాంటి తవ్వకాలు జరగలేదని తెలిసింది. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన గంగాధర్‌రెడ్డిపై దాడి చేసిన కేసులో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నరసింహులు మంగళవారం తెలిపారు. గంగాధర్‌రెడ్డి కనకాద్రిపల్లెలో ట్రాక్టర్ ఆపి స్వగ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో శివశంకర్‌రెడ్డి అడ్డగించి గతంలో నా ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా రమ్మని పిలిస్తే రావా అని అడగడంతో ఇద్దరి మధ్య మాట మాట పెరిగిందిజ గంగాధర్‌రెడ్డిని శివశంకర్ రెడ్డి చెప్పుతో కొట్టి అవమానించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

పిల్లల ఎదుగుదలపై అవగాహన అవసరం

కర్నూలు(హాస్పిటల్): పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని, ఈ మేరకు ఆశాలు చైతన్యపరచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం కర్నూలు మండలం ఇ. తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశా కార్యకర్తలు గృహ సందర్శనలు చేసినప్పుడు పిల్లల శారీరక, మానసిక, భాష, సాంఘిక అభివృద్ధి దశల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. 18-22 వారాల హైరిస్క్ గర్భిణులను టిఫా స్కాన్స్ కోసం ఆరోగ్యశ్రీ ఎన్‌ప్యానెల్ ఆసుపత్రులకు వైద్యాధికారి సూచనలతో రెఫర్ చేయాలని తెలిపారు. ఆశా యాప్‌లో అర్హులైన దంపతుల సేవలు, ఐరన్ మాత్రల పంపిణీ, విటమిన్-ఎ ద్రావణ పంపిణీ, నవజాత శిశుసేవల వివరాలను క్రమం తప్పకుండా అప్‌లోడ్ చేయాలని తెలిపారు. లింగ వివక్షత నిర్మూలన, గర్భస్థ లింగనిర్ధారణ వ్యతిరేక చట్టం, ఆడపిల్లల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వడదెబ్బ లక్షణాలు, ప్రథమ చికిత్సగురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మంజూష, పీసీ పీఎన్‌డీటీ మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

10న క్రికెట్ జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్) : ఈనెల 10 వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉన్న క్రికెట్ నెట్స్‌లో అండర్-23 విభాగం, సీనియర్ క్రికెట్ జట్లకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె. దేవేంద్రగౌడ్ మంళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2001 సంవత్సరం తరువాత జన్మించిన వారు అండర్ -23 ఎంపిక పోటీలకు అర్హులని తెలిపారు.

బైక్‌పై నుంచి పడి ఒకరి మృతి

రుద్రవరం: మండలంలోని చిన్నయ్య స్వామి చెంచుగూడెం వద్ద మోటర్ సైకిల్ అదుపు తప్పి కింద పడిన ఘనటలో భాస్కర్(32) మృతి చెందగా, మయూర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు కోటకొండకు చెందిన భాస్కర్, మయూర్ మంగళవారం మోటార్ సైకిల్ గాజులపల్లె వైపు వెళ్తుండగా చెంచుగూడెం మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో కిందపడి తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికులు వెంటనే నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే భాస్కర్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మయూర్ పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

నేతన్నపై పచ్చపాతం



మగ్గంపై పట్టు వస్త్రాల తయారీలో కార్మికుడు

"చేనేతల సంక్షేమానికి పెద్దపీట వేస్తామంటూ ఎమ్మిగనూరు సభలో ప్రగల్భాలు పలికిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మరోమారు చేనేతల చెవిలో పూలు పెట్టారు. టీడీపీ–జనసేన ప్రకటించిన ఉమ్మడి మేనిఫెస్టోలో చేనేతల బతుకుల్లో మార్పులు తెచ్చిన 'నేతన్న నేస్తం' ప్రస్తావన లేకపోవడంతో చేనేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటిలాగే అబద్ధపు హామీలు.. ఆపై విస్మరించడం అలవాటైన బాబుకు ఈసారి ఎన్నికలకు ముందుగానే నేతనలకు మొండి చేయి చూపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఐదేళ్లపాటు నేతన్న నేస్తంతో చేనేతలకు అండగా నిలిచారు. చేనేతలకు నేతన్న నేస్తం ద్వారా మరింత మేలు చేస్తానని మేనిఫెస్టోలో చేర్చి చేనేతల పక్షపాతిగా మారారు."

- చేనేతల చెవిలో చంద్రన్న పూలు
- టీడీపీ మేనిఫెస్టోలో నేతన్న నేస్తంకు దక్కని చోటు
- అప్పెరల్ పార్కు తరహాలో మరోసారి మోసం
- నేతన్న నేస్తంతో ఆదుకున్న జగన్
- ఏటా రూ.24 వేల ఆర్థిక సాయం

నేతన్న నేస్తం లబ్ధి వివరాలు		
	ఉమ్మడి కర్నూలు జిల్లాలో చేనేత కుటుంబాలు	4,148
	ఏటా నేతన్న నేస్తం కింద ప్రభుత్వం అందిస్తున్న సాయం	రూ.24 వేలు
	ఐదేళ్లలో ఒక్కో కుటుంబం అందుకున్నది	రూ.1.20 లక్షలు
	జిల్లాలోని చేనేతలు పొందిన లబ్ధి	రూ.47.58 కోట్లు

ఎమ్మిగనూరు: ప్రజాసంకల్ప పాదయాత్ర ద్వారా అణగారిన చేనేత బతుకులను కళ్లారా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి చేయూతనిచ్చేందుకు సంకల్పించారు. చేనేత కార్మికుల కోసం ఐదేళ్లుగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని మేలు చేస్తున్నారు. ఐదేళ్లపాటు బడ్జెట్‌లో చేనేతల కోసం ప్రత్యేకంగా రూ.1000 కోట్లు కేటాయించి సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లారు. నేతన్న నేస్తం ద్వారా అర్హులైన చేనేత కుటుంబాలకు ఏటా రూ.24వేలు చొప్పున వారి అకౌంట్లలోనే జమ చేస్తుండటంతో నేతన్నలకు ఆర్థిక భరోసా లభించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో చేనేత కుటుంబాలకు రూ.47.58 కోట్లు లబ్ధి చేకూరింది. అందులో ఎమ్మిగనూరు నియోజకవర్గానికే రూ.24.52కోట్ల లబ్ధి చేకూరడం విశేషం. ఈ పథకం ద్వారా జిల్లాలో 4,148 కుటుంబాలకు మేలు జరిగింది. ఐదేళ్లపాటు ఒక్కో చేనేత కుటుంబానికి రూ.1.20లక్షల ఆర్థిక తోడ్పాటు అందింది. ప్రభుత్వ చేయూతతో చేనేతల్లో ఆత్మస్థైర్యం పెరిగింది. మరో ఐదేళ్లపాటు నేతన్న నేస్తం కొనసాగిస్తామంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చడంతో నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో నేతన్న నేస్తం ప్రస్తావన చేయకపోవడంతో బాబొస్తే నేతన్న నేస్తం రద్దవుతుందని ఆందోళన చెందుతున్నారు.

బాబు పాలనలో దుర్భర జీవితం

అగ్గిపెట్టెలో చీరను ఇమర్చే నైపుణ్యం ఒకప్పుడు ఎమ్మిగనూరు చేనేతల సొంతం. ఇక్కడి చీరలు అంతర్జాతీయ ఖ్యాతిని పొందాయి. మారుతున్న సంస్కృతి, పాశ్చాత్య సంప్రదాయాల మూలంగా చేనేతలకు ఆదరణ తగ్గింది. వారి సంక్షేమార్థం నెలకొల్పిన సంఘాలు, క్లస్టర్లు సైతం అవినీతి ఊబిలో కూరుకుపోయాయి. మాటల గారడితో చేనేతలను ఐదేళ్లు మభ్యపెట్టిన గత పాలకులు పలాయనం చిత్తగించారు. నేసిన నూలు చీరలకు గిట్టుబాటు దక్కక చేనేతలు గద్వాల పట్టు చీరలవైపు మొగ్గుచూపారు. గద్వాల చీరలకు వన్నెలద్ది గిట్టుబాటు సరిచూసుకుంటున్న తరుణంలో ముడి సరుకు అందడం ఆగిపోయింది. దీంతో తిరిగి వెనక్కి చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాణ్యమైన పట్టును అందించి చీరలను నేయించుకునే మాస్టర్ వీవర్స్ కాలానుగుణంగా నాణ్యతలేని (టిస్టెడ్) జెరిని అందిస్తున్నారు. ఈ చీరను నాలుగు రోజుల్లో పూర్తి చేస్తే వచ్చే రూ.800ల కూలి రూ.400లకు పడిపోయింది. చేనేతలు తామె ముడిసరుకును తీసుకుని తయారు చేసిన చీరలను మాస్టర్ వీవర్స్ వద్ద విక్రయానికి పోతే తక్కువ ధరకు కొనుగోలు చేసి చేనేతల కష్టాన్ని కాజేసేశారు. చేనేతల కోసమంటూ బాబు పాలనలో రెండు పర్యాయాలు ఎన్నికలకు ముందు అప్పెరల్ పార్కుకు పునాదిరాళ్లు వేసి మమ అనిపించారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో ఇలా

వైఎస్సార్‌సీపీ పాలనలో నేతన్న నేస్తం ద్వారా చేనేతలకు జిల్లాలో 47.58కోట్ల లబ్ధి చేకూరింది. చేనేత క్లస్టర్ల ద్వారా 90శాతం సబ్సిడీతో చేనేతలకు అధునాతన యంత్ర సామగ్రి అందజేసింది. ఎమ్మిగనూరు, ఆదోని క్లస్టర్‌లలో రూ.90లక్షలతో యంత్రసామగ్రి పంపిణీ చేసింది. ప్రభుత్వ చొరవ.. చేయూతతో చేనేత ఉత్పత్తుల వ్యాపారం విస్తరించి నేతన్న కుటుంబాల్లో వెలుగులు నిండాయి.



"ఈమె పేరు మహాలక్ష్మి. నందవరం గ్రామం. భర్త అకాల మరణం పొందడంతో కుటుంబ భారమంతా ఆమెపైనే పడింది. మగ్గం ఆడితే తప్పా ఇంటిల్లిపాదికి మూడుపూటలా పెట్టే పరిస్థితి లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన వరమైంది. నేతన్న నేస్తం కింద రూ.24 వేల చొప్పున ఐదేళ్లలో రూ.1.20 లక్షలు అందుకుంది. అమ్మఒడి ద్వారా రూ.55 వేలు పొంది తన పిల్లలను చదివిస్తోంది. ప్రతి నెలా వితంతు పింఛన్ అందుకుంటోంది. మోడిబారిన మగ్గం బతుకులకు సంక్షేమ రంగులు అద్దిన మహానుభావుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి" అంటూ మహాలక్ష్మి మహానందంతో చెబుతోంది. నేతన్న నేస్తం ద్వారా మరో ఐదేళ్ల పాటు చేనేతలకు మేలు చేస్తానంటూ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టడం సంతోషంగా ఉందని అంటోంది.



"ఈమె పేరు టి.లక్ష్మి. నందవరం మండలం నాగలదిన్నె గ్రామం. జగనన్న నేతన్న నేస్తం కింద ఏటా రూ.24 వేలు అందుకుంటోంది. గత పాలకుల ఏలుబడిలో చేనేత బతుకులు చిద్రమయ్యాయని, చాలా మందిని వృత్తిని వదిలేసి హోటళ్లు, అంగళ్లలో కూలీ పనుల్లో చేరారని తెలిపింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చేనేతల్లో మార్పు వచ్చింది. నేతన్న నేస్తం, చేనేత పెన్షన్లు అందిస్తున్నారు. క్లస్టర్‌ల ద్వారా సబ్సిడీతో నూలు, యార్న్ దొరుకుతున్నాయి. నేసిన చీరలకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. ఐదేళ్లలోనే చేనేతల్లో ఇంత మార్పు తెచ్చిన ముఖ్యమంత్రి మరో ఐదేళ్లు అధికారం చేపడితే చేనేతల్లో శాశ్వత వెలుగులొస్తాయని" ఆశాభావం వ్యక్తం చేస్తోంది.



వస్త్రం నేస్తున్న నేతన్న

చంద్రబాబు, లోకేష్‌ను అరెస్టు చేయాలి

- టీడీపీ గుర్తింపును రద్దు చేయాలి
- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ డిమాండ్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, లీగల్ సెల్ నాయకులు

కర్నూలు (టౌన్) : ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై దుష్ప్రచారం చేసిన తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌ను వెంటనే అరెస్టు చేయాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నరసింగరావుపేటలోని వైఎస్సార్‌సీపీ నగర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ఎం.ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి ఎస్. హనుమంతరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు సువర్ణ రెడ్డి, జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సుబ్బయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు, జగనన్న ప్రతిష్ఠను దిగజార్చేందుకు చంద్రబాబు, లోకేష్ కుట్రలు పన్నుతున్నారన్నారు. ప్రజల ఆస్తుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని తీసుకొస్తే.. ప్రజల ఆస్తులను దోచుకోవడానికి వైఎస్ జగన్ చట్టం తెస్తున్నాడని చెప్పడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబుకు దమ్ముంటే ప్రధాని మోదీ ఎదుట ఈ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయం అని చెప్పాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లుగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేశారని, పేదలను ఉన్నత స్థితిలోకి తీసుకొచ్చేందుకు కంకణం కట్టుకున్న నాయకుడు జగనన్న అని ఆయనను మరోసారి ఆదరించాలని ప్రజలను కోరారు. రాష్ట్ర ప్రజల కోసం 25.46 లక్షల ఎకరాల భూములను పంచిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. నీతి ఆయోగ్ సిఫారసు మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రతి రాష్ట్రంలో ల్యాండ్ టైటిల్ యాక్ట్ చట్టాన్ని ప్రవేశ పెట్టాలని కోరడంతో.. రాష్ట్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేస్తుందన్నారు. ఇంకా నిబంధనలు రూపొందించలేదని, అమలులోకి రాలేదన్నారు. ప్రజలను భయపెట్టేందుకు ఈ చట్టాన్ని బూచిగా చూపుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి దుష్ప్రచారాలు మానుకోకపోతే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.

బాబుకు మతి భ్రమించింది

- సొంతమేనిఫెస్టో తయారు చేసుకోలేని నాయకుడు చంద్రబాబు
- ఆధారాలతో నిరూపించినా తనపై పదేపదే కబ్జాలంటూ దుష్ప్రచారం
- శబరి తండ్రి చేసిన కబ్జాలు కనిపించడం లేదా?
- గౌరు చరిత భర్త, బంధువుల ఆగడాలు ఎవరికి తెలియవు?
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: ఆధారాలతో నిరూపించినా తనపై కబ్జాల ఆరోపణలు చేస్తున్న చంద్రబాబుకు మతి భ్రమించిందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం పాణ్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏ పార్టీ అయినా సొంత నిర్ణయాలు, మేనిఫెస్టో, విధి విధానాలుంటాయి.. అయితే టీడీపీలో మాత్రం ఇతర పార్టీల నుంచి కాపీ చేసినవే ఉంటాయి.. ప్రస్తుత ఎన్నికల్లో చిన్న పార్టీలు కూడా సొంతంగా మేనిఫెస్టో రూపొందించుకున్నాయి.. టీడీపీ అధినేత చంద్రబాబు మాత్రం సొంత మేనిపెస్టో తయారు చేసుకోలేని దద్దమ్మ అని విమర్శించారు. మీకు లబ్ధి చేకూరి ఉంటేనే ఓటు వేయండని చెప్పిన దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అలా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో బాబు ఒక్కనాడైనా అలా చెప్పగలిగాడా అని ప్రశ్నించారు.

ఇంట్లో ఆడవారితో రాజకీయమా..

అసెంబ్లీలో తన కుటుంబ సభ్యులను అన్నారని ఆపాదించుకొని మీడియా ముందుకు వచ్చి ఏడ్చి ఇంట్లో ఆడవాళ్లతో రాజకీయం చేశాడన్నారు. నాయకుడు ఆదర్శంగా ఉండాల్సింది పోయి నీచ రాజకీయ సంస్కృతికి తెరలేపారని మండిపడ్డారు.

మీ కుటుంబ సభ్యుల కబ్జాలు తెలుసుకోండి..

తరచూ తనపై కబ్జాలు అంటూ ప్రచారం చేసే టీడీపీ వాళ్లు వారి కుటుంబ సభ్యుల కబ్జాల గురించి తెలుసుకోవాలని హితవు పలికారు. నంద్యాల ఎంపీ అభ్యర్థి శబరి.. నీ తండ్రి కబ్జాలు ప్రజలందరికీ తెలుసన్నారు. నీ తండ్రి.. మైదుకూరుకు చెందిన వారి ప్లాట్‌ను లాక్కొని ఇంటిని నిర్మించున్నారన్నారని గుర్తు చేశారు. టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి భర్త, బంధువు కబ్జాల గురించి తెలుసుకుంటే బాగుంటుందన్నారు. కబ్జరాయుళ్లను పక్కనబెట్టుకొని తిరుగుతున్నది నీవే బాబు అని ఎద్దేవా చేశారు. తాను ఆధారాలతో నిరూపించినా బాబు మతిభ్రమించి ఆరోపణలు చేస్తున్నాడన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు పీవీ బద్రీనాథ్‌రావు, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, గగ్గటూరు శ్రీనివాసరెడ్డి, రామలక్ష్మయ్య పాల్గొన్నారు.

ముగిసిన ప్రహ్లాదవరదుడి వసంతోత్సవాలు



ఉభయ దేవేరులతో వసంతోత్సవంలో కొలువైన ప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ: అహోబిలంలో వార్షిక వసంతోత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. అదిగువ అహోబిల క్షేత్రంభక్తజన సంద్రంగా మారింది. ఉభయ దేవేరులైన శ్రీదేవి, భూదేవి శ్రీ ప్రహ్లాదవరదస్వాములు మంగళవాయిద్యాల నడుమ ఆలయం నుంచి వసంత మండపానికి ఊరేగింపుగా వచ్చారు. అక్కడ ఉత్సవమూర్తులను కొలువుంచి 108 కళశాలతో కళశస్థాపన చేసిన అనంతరం పంచామృతాలతో అభిషేకించి పట్టుపీతాంబరాలతో అలంకరించారు. రాత్రి స్వామి వారు అశ్వవాహనాన్ని అధిరోహించి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు. సోమవారం అర్ధరాత్రి అనంతరం పూర్ణాహుతితో ఉత్సవాలను ముగించి అవభృత స్నానం ఆచరించారు.

ఉత్సవ విశిష్టత..

వసంత రుతువులో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించేందుకు మూడు రోజుల పాటు జరిపే ఉత్సవాలను వసంతోత్సవాలు అంటారు. ఉత్సవంలో స్వామికి చల్లటి గాలి వీచేలా సుగంధాన్ని వెదజల్లే పలు రకాల చెట్ల ప్రతిరూపాలతో అడవిని తలపించేలా మండపాన్ని తీర్చిదిద్దుతారు. సుగంధాన్ని వెదజల్లే పుష్పాలతో పాటు పలురకాల సీజనల్ మధుర ఫలాలను స్వామివారికి నివేదిస్తారు.



అశ్వవాహనంపై ఊరేగుతున్న దేవదేవుడు

నంద్యాలలో గాలివాన బీభత్సం



నంద్యాలలో కురుస్తున్న వర్షం



బైరవాణికుంటలో 4 కేజీల వడగండ్లను చూపుతున్న గ్రామస్తులు

నంద్యాల(అర్బన్): నంద్యాలలో మంగళవారం రాత్రి గంటన్నర పాటు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రెండు నెలలుగా ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడిన జనానికి కాస్త ఉపశమనం కలిగింది. నంద్యాల మొత్తం తడిసి ముద్దయ్యింది. ఉన్నఫలంగా పెద్ద శబ్దాలతో ఉరుములు, మెరుపులు రావడంతో పట్టణ ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఏం జరుగుతుందో తెలియక ఆందోళనకు గురయ్యారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇంట్లో నుంచి బయటకు వచ్చేందుకు సాహసించలేక పోయారు. పలు ఇళ్ల ముందు ఉన్న పైకప్పుల రేకులు ఎగిరిపోయాయి.

బైరవాణికుంటలో 4 కేజీల వడగండ్ల వాన

దేవనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. బైరవాణికుంటలో సుమారు 4 కేజీల వడగండ్లు లభ్యమయ్యాయి. గ్రామంలో పిడుగుపాటుకు 20 మేకలు మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.2 లక్షలు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు. అలాగే నేలతలమరి, గుండ్లకొండ గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది.

వడగండ్ల వాన

కర్నూలు (అగ్రికల్చర్): కొద్ది రోజులుగా ఎండలు, వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. మంగళవారం సాయంత్రం నుంచి కర్నూలు సహా వివిధ పట్టణాల్లో పెనుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. కర్నూలు, కల్లూరు, చిన్నటేకూరు, పెద్దటేకూరు, ఉలిందకొండ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. కర్నూలు, కల్లూరు మండలాల్లోని వివిధ గ్రామాల్లో వడగండ్లు పడ్డాయి. ఈదురుగాలుల తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఆరోగ్యశ్రీతో ఆసుపత్రి మరింత అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆరోగ్యశ్రీ పథకం కారణంగా ఆసుపత్రి మరింత అభివృద్ధి చెందుతోందని, ఈ మేరకు వైద్యులు, సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో వివిధ విభాగాధిపతులు, ప్రొఫెసర్లతో ఆరోగ్యశ్రీ, ఈ-హాస్పిటల్, వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాల్లో ఆరోగ్యశ్రీకి సంబంధించి ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేసిన హెచ్‌ఓడీలను అభినందించారు. పలు విభాగాల్లో తిరస్కరించిన 57 కేసుల్లో 40 కేసులు అప్రూవల్ అయ్యాయని తెలిపారు. ఆసుపత్రిలోని పలు విభాగాల్లో ఈ-హాస్పిటల్ అమలు బాగా జరుగుతోందని కొనియాడారు. అన్ని విభాగాల్లో ఉండే హౌస్‌సర్జన్లు తప్పకుండా ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఓడీలను ఆదేశించారు. హౌస్‌సర్జన్లపై పర్యవేక్షణ చేయాలని, డ్యూటీకి రాని వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, కేఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ రాధారాణి, డాక్టర్ మంజులబాయి, డాక్టర్ విజయానందబాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీ 'గూడు' పురాణి



ఓట్ల కోసం టీడీపీ అభ్యర్థి బీసీ జనార్ధన్‌రెడ్డి కుయుక్తులు

- మొన్న కోవెలకుంట్లలో ఇళ్లస్థలాల పేరుతో టైలర్లకు టోకరా
- నిన్న బనగానపల్లెలో ఇళ్లస్థలాలు ఇవ్వకుండా అడ్డుకున్న ఘనుడు
- నేడు రెండు సెంట్ల స్థలం ఇస్తామంటూ గాలం

కోవెలకుంట్ల: 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ అభ్యర్థులు ఎన్ని అడ్డదారులు తొక్కి అయినా గెలవాలన్న ఉద్దేశం ఓటర్లను మభ్య పెట్టేందుకు ఉచిత హామీలు గుప్పిస్తున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి బీసీ జనార్ధన్‌రెడ్డి ఎన్నికల వేళ ఓటర్లకు ఇళ్లస్థలాల పేరుతో గాలం వేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే రెండు సెంట్ల స్థలాన్ని అందజేస్తామని కల్లిబొల్లిమాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, బనగానపల్లె మండలాల్లోని ఆయా గ్రామాల్లో 12,136 మందికి ఇళ్లస్థలాలు మంజూరు చేసింది. పేదలకు సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశం ఆయా మండలాల్లో ఇళ్ల లేని నిరుపేదలను గుర్తించి ఇంటి స్థలంతోపాటు పక్కా హాలు మంజూరు చేసింది. కోవెలకుంట్ల మండలంలో 2,234 మందికి, కొలిమిగుండ్లలో 1,999 మందికి, సంజామల మండలంలో 1,530 మందికి, అవుకు మండలంలో వెయ్యి మందికి, బనగానపల్లె మండలంలో 5,373 మందికి ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయి. ప్రభుత్వ స్థలాలు అందుబాటులోని లేని గ్రామాల్లో ప్రైవేట్ భూములను ఎకరా రూ. 20 లక్షల నుంచి రూ. 25 లక్షలతో కొనుగోలు చేసి ఇళ్లస్థలాలు పంపిణీ చేసింది. ఆయా గ్రామాల్లో జగనన్న కాలనీల్లో నిర్మించిన ఇళ్ల ఊర్లను తలపిస్తున్నాయి.

బనగానపల్లెలో అడ్డుకున్న బీసీ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్లస్థలాలతో పక్కాగృహాలు మంజూరు చేయగా టీడీపీ అభ్యర్థి బీసీ జనార్ధన్‌రెడ్డి ఇళ్లస్థలాల పంపిణీకి మోకాలొడ్డాడు. బనగానపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో 3,200 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించగా లబ్దిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వవద్దని బీసీ కోర్టును ఆశ్రయించారు. 2020 డిసెంబర్ 25వ తేదీన నియోజకవర్గంలోని మిగిలిన మండలాల్లో ఇళ్లస్థలాలు పంపిణీ చేయగా బీసీ జనార్ధన్‌రెడ్డి కుట్రతో బనగానపల్లె పట్టణంలో ఇళ్లస్థలాల పంపిణీకి బ్రేక్ పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్లస్థలాలు ఇవ్వడంతో పాటు పక్కాగృహ నిర్మాణానికి రూ. 1.80 లక్షల నిధులు మంజూరు చేసింది. 20 టన్నుల ఇసుక ఉచితంగా సరఫరా చేయడంతోపాటు రాయితీపై సిమెంట్, కడ్డీలు, కిటికీలు, వాకిళ్లు, తదితర ఇంటి నిర్మాణ సామగ్రిని అందజేయడంతో పాటు మూడు విడతల్లో గృహ నిర్మాణ బిల్లులు చెల్లించింది. బనగానపల్లె పట్టణంలో మాత్రం బీసీ పుణ్యమా అంటూ లబ్ధిదారులు ఇళ్లస్థలాలకు నోచుకోలేదు. అలాగే 2014 సార్వత్రిక ఎన్నికల్లో కూడా కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో 200 మంది టైలర్లకు ఉచితంగా ఇళ్లస్థలాలు ఇస్తామని చెప్పి ఆ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రాగానే ఒక్క సెంటు స్థలం ఇవ్వకుండా టైలర్లను మోసం చేశాడు.

పేదలకు అనుకూలంగా తీర్పు

బనగానపల్లె పట్టణంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా బీసీ జనార్ధన్‌రెడ్డి అడ్డుకోగా సొంతిల్లు లేని పేదల కష్టాలను గుర్తించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోర్టు ద్వారా పోరాడారు. చివరకు అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలు పంపిణీ చేయాలని ఇటీవల కోర్టు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు ఆస్కారం లేదు. ఇళ్లస్థలాలు పంపిణీ చేయకుండా ఐదేళ్లపాటు అడ్డుకున్న బీసీ ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో ఓట్ల కోసం పేదలకు రెండుసెంట్ల స్థలాన్ని ఇస్తామని చెబుతుండటాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వం కేటాయించిన ఇళ్లస్థలాలు ఇవ్వకుండా అడ్డుకున్న వ్యక్తి ఓట్ల కోసం ఇళ్లస్థలాల అంశాన్ని తెరపైకి తెచ్చాడని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలందరికి ఇంటిస్థలం, పక్కాగృహాలు నిర్మించి సొంతింటి కల నేరవేర్చింది. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇంటిస్థలం, పక్కాగృహం మంజూరు చేసి అందరికీ న్యాయం చేసింది. 2024 ఎన్నికల్లో ఇళ్లస్థలాల హామీని ఎరగా వేసి లబ్ధి పొందాలని బీసీ కుయుక్తులు పడుతున్నారు. టీడీపీ అభ్యర్థి ఇళ్లస్థలాల మాయను ఎటువంటి పరిస్థితుల్లో నమ్మబోమని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు.